# శివరావు కోట

### శ్రీమతి ఆర్. వసుంధరాదేవి

శివరావు గొప్ప మేధావి. అతను సైకో ఫిజిక్స్, సైకోడైనమిక్స్‌లలో చేసిన పరిశోధనల వలన ప్రపంచ వ్యాప్తమైన కీర్తి గడించాడు చిన్న వయసులోనే. ఇప్పుడు 'మానవుని అనుభవాన్ని నిత్యసత్యంగా మార్చడం ఎలా?' అన్న విషయంమీద పనిచేస్తున్నాడు.

దైనందిన జీవితంలో మనిషి ఎన్నో అనుభవాలకు లోనవుతున్నాడు. అందులో చాలభాగం అర్థం లేనివీ, వ్యర్థమైనవీను. కొన్నిటిని అనుభవిస్తున్నట్లు అతనికే తెలియదు. కొన్నిటిని నెమరువేసి సాగదీసి అనుభవిస్తాడు. కాని ఒక్కటికూడా అతనికి మిగలటంలేదు! రుచికరమైన పదార్థాలెన్నో తింటాడు. రుచి అనే అనుభవం ఎక్కడకు పోతుందో మరి, ఆ క్రియతోటి అదీ మాయమైపోతుంది. వాసన, సుఖము, భోగము, నవ్వు, ఏడుపు అన్నీ ఏమైపోతున్నవో. కొన్ని కొంత కాలంవరకూ జ్ఞాపకాలుగా నిలిచినా తరువాతైనా జారిపోతాయి. తాను కోరుకున్న కొన్ని ముఖ్యమైన అనుభవాల్ని శాశ్వతం చేసుకుంటే మానవ జీవితానికి పూర్ణతవస్తుంది. ఆ ప్రక్రియ కనిపెడితేగాని మానవజాతికి నిజమైన మనుగడ వుండదు. దానికోసమే శివరావు ప్రయత్నం.

శివరావుకు తన పరిశోధనలమీద తప్ప మిగతా ప్రపంచంలో ఆసక్తిలేదు. అనురాగాలు, అనుబంధాలు మొదలైన భావనలు అశాస్త్రీయములన్న నిర్లక్ష్యం. కాని యీ మధ్యనే జీవితం విసిరే ఉచ్చులో చిక్కుకున్నాడు. గౌరి అనే అమ్మాయి అతన్ని బలంగా ఆకర్షిస్తోంది. అది యౌవన సహజమైన కామవాంఛయొక్క గుడ్డి రూపాంతరమేనని అతను అనుమానించినా, యింకా ఒక నిర్ధారణకు రాలేదు.

గౌరి ఎక్కువ ఆలోచనా పటిమగల వ్యక్తికాదు. శాస్త్రీయమైన ఆలోచనా ధోరణి ఆ పిల్లకులేదు. పైగా శివరావు పరిశోధనలతో సహా మానవ ప్రయత్నాలే అపహాస్యం చేస్తున్నట్లు మాట్లాడుతుంది. ఆకాశంలో స్పష్టంగా కనిపించే నక్షత్రాలసంగతి వుంచండి. కనిపించీ కనిపించని నక్షత్రాలుంటాయి, అవి నేరుగా, శ్రద్ధగా, పరీక్షగా చూస్తే అసలు కనిపించవు. ప్రక్కగా ఓటో చూస్తున్నప్పుడు మరింత కాంతితో ప్రత్యక్షమౌతాయి.

ఏదైనా విషయం గుర్తుకు తెచ్చుకోవాలంటే ఎంత ప్రయత్నించినా గుర్తుకురాదు. ఆ ప్రయత్నం ఒదిలేశాక, వేరేపనిలో వున్నప్పుడు గబుక్కున గుర్తుకొస్తుంది.

ప్రపంచగతినే ప్రభావితం చేసిన ఎన్నో పరిశోధనలు యిలాగే ప్రయత్నం విరమించాక సిద్ధించినవే... కాబట్టి మీరు యింత తీవ్రంగా ఆలోచించకుండా ఒదిలెయ్యండి. సమాధానం ఎక్కణ్ణుంచో వస్తుంది అని నవ్వుతుంది. ఎప్పుడూ నవ్వుతూ; గలగలాపారే సెలయేరులాగా వుంటుంది గౌరి. ఆ నవ్వే శివరావుని అతివిలువైన పనిలోనుంచీ కళ్లెంవేసి లాక్కొస్తున్నది.

శివరావుకి 'ఎదురుచూడ్డం' అంటే సరిపడదు. అతనికి కాలం విలువైనది కాని యివాళ గౌరికోసం ఎదురు చూస్తున్నాడు. ఊరి బయట తోటపక్కన గుట్టలుండే విశాలమైన బయలు అది. గౌరికి యిలాంటి చోట్లంటే యిష్టం. అందుకే యిక్కడికి రమ్మన్నది. కాని చెప్పిన ప్రకారం ఆ పిల్లరాలేదు. శివరావుకి విసుగ్గా వుంది. గౌరి జ్ఞాపకాల తియ్యని మత్తులో గడ్డిమీద వెల్లకిలా పడుకున్నాడు. పనిలేకపోవడాన్నో, తీవ్రమైన పరిశ్రమ తర్వాతి అలసటవలననో క్రమంగా నిస్పృత్తువగా మగతలోనికి జారిపోయాడు.

అప్పుడు ఈ విచిత్రం జరిగింది. పడుకున్న అతని నోట్లోంచి అప్రయత్నంగా 'మంచితనం' అన్నమాట బయటికి వచ్చింది.


# భారతి

## చందా వివరములు

| | | ఏజంటుద్వారా | పోస్టులో |
|---|---|---|---|
| విడి ప్రతి | రు. | 1-50 | - |
| 6మాసములచందా | రు. | 9-00 | 9-60 |
| సంవత్సరచందా | రు. | 18-00 | 19-20 |

మేనేజరు

భారతి

ఆ భావం అతని కళ్ళముందే బయటకువచ్చి ఘనీభవించి రాయిగా రూపొందింది. ఎలా? నిజమా? అనుకున్నాడు. ఎదురుగా రాయి వున్నది—గట్టిగా, నిజంగా, తెల్లగా, తేలిగ్గా, కాంతి విరోధమైన దీర్ఘఘనం. దాన్ని చూస్తేనే మంచితనంలో తేలిపోతున్నట్లుంది. సందేహానికి తావులేదు! అతనికి భయంవేసింది. కొంత సేపటికి తేరుకున్నాడు. 'సుఖం' అన్నాడు. ఆ మాట కూడా ఘనీభవించింది. ఈసారి భయం వెయ్యలేదు. దాన్ని పట్టుకుని చూచాడు. ఎంతో సుఖమనిపించింది. గట్టిగా, నిజంగా, పచ్చగా, కాంతివిరోధమైన దీర్ఘఘనం. ఈసారి అతనికి సరదా పుట్టింది. 'చలి' అన్నాడు. బూడిదరంగు రాయి ఏర్పడింది. సరదాగా చాలా రాళ్లు తయారుచేశాడు. అందమైన రాళ్లకుప్ప ఏర్పడ్డది.

తాను చేస్తున్న పని విషయంలో అతనికి సందేహం పోలేదు. ఎవరైనా చూస్తున్నారేమోనని చుట్టూ చూశాడు. దూరాన పచ్చని చెట్టు. దాని క్రింద ముసలివాడు. అస్థిపంజరానికి చర్మం తొడిగినట్లున్నాడు. ఒక్కోసారి అస్థిపంజరం మాదిరిగానూ కనిపిస్తున్నాడు. శివరావునే చూస్తున్నాడు. ఏ భావంలేకుండా వూరికే చూస్తున్నాడు. తాను చేస్తున్న పనికి నవ్వినా, తిట్టినా, ఎగతాళిచేసినా శివరావుకి బాధగా వుండేదికాదు. కాని యీచూపు అతనికి సరిపడలేదు. ఏమీ చెయ్యలేక, తలత్రిప్పి రాళ్లగుట్టను పరిశీలిస్తూ కూర్చున్నాడు. చూడగా చూడగా రాళ్లన్నీ ఒకేమాదిరిగా కన్పించసాగాయి.

వాటిని కూర్చి అర్థవంతమైన ఆకారంయిస్తే, ఎట్లావుంటుందో అన్న ఆలోచన వచ్చింది. ఒకదానిమీద ఒకటి పేర్చాడు. చక్కగా అతుక్కుపోయాయి. ముసలి వానికీ తనకీ మధ్యన గోడలా కడుతూపోయాడు. కొంతసేపు కట్టి ఒక చివరకుపోయి తొంగిచూశాడు. ముసలివాడు అలానే చూస్తూనే వున్నాడు. శివరావుకి చాలా కోపంవచ్చింది. అర్థం లేకపోవడాన్ని శివరావు సహించలేకపోతున్నాడు. ఆ చూపును భరించాల్సిన అవసరం తనకులేదు! తన చుట్టూ అనుభవాలకోట కట్టి, ఆ ముసలాడు ఎప్పటికీ కనపడకుండా చేసుకోగలడు...రకరకాల యిటుకలు చేస్తూ చిత్రవిచిత్రాలుగా పేరుస్తూ కోట కడుతూ పోతున్నాడు శివరావు. బాహ్య ప్రపంచాన్ని మరిపించేటంత ఆసక్తి పుట్టింది పనిలో. చుట్టూ గోడలు పైకి లేచినై.

గౌరి యిప్పటికైనా వస్తున్నదేమోనని గోడపైకి ఎక్కి చూశాడు. గౌరి రావటంలేదుగాని ముసలాడు అట్లాగే చూస్తూ వున్నాడు. ఈసారి శివరావుకి చాలాకోపం వచ్చింది. 'ఈ అస్థిపంజరంతో నాకేం పని' అనుకుని కోట పైనంతా శుద్ధంగా మూసేశాడు. అందమైన కోటలో కూర్చున్నాడు. కోట అందమే మనసంతా ఆక్రమించుకున్నది. బయటి ప్రపంచంతో సంబంధం లేకుండా, తన పరిశోధనలు చేసుకుంటూ హాయిగా వుండొచ్చు యిలా అందాల కోటలో! అనుకున్నాడు. వాకిలిగా వదలిన సందులోనుంచి గౌరి కనిపించింది. గబగబా నడిచి వస్తోంది. తన ఆలస్యానికి క్షమాపణలు చెప్పుకుంటున్నట్లుగా వేగంగా వస్తోంది. గౌరిని చూస్తున్న శివరావు కళ్ళకి గౌరి వెనుగ్గా, చెట్టుక్రింది ముసలాడు కన్పించాడు. ఇద్దరూ ఒకటిగా కన్పించారు. తల విదిలించుకున్నా భ్రాంతి వదల్లేదు. అప్పుడు శివరావుకి అనుమానం వచ్చింది. ఈ గౌరి కోటలోకి వస్తుందా? ముసలాడి దగ్గర చెట్టు కింద హాయిగా వుందామంటుంది! శివరావులో గౌరి వస్తున్నదన్న సంతోషం పోయింది. నడిచి నడిచి ఆలస్యంగా వస్తున్న గౌరి దూరాన్నించి పరిశీలనగా చూశాడు. ఆ వంకరటింకర నడకా, లావూ, తెలివిలేని నవ్వూ...యిలాంటి మనిషిమీద నాలో అంత ఆకర్షణ ఎట్లా కలిగిందని ఆశ్చర్యపోయాడు.

ఆ గౌరి లోనికి రాకూడదు. ఆ వాకిలి కూడా మూసేస్తే, కాని తనకు శాంతిలేదు! ఇంతవరకూ అతను మాటగా యిటుకగా మార్చని భావం ఒకటి వుండిపోయింది. 'ప్రేమ' అన్నాడు. వెంటనే ఆ మాట బయటికివచ్చి, వ్యాపించి, ఘనీభవిస్తుండగానే విరిగి విసుగు, కోపం, భయం, అసహ్యం అయి వాకిట్లో కుప్పబడిపోయింది. ఇప్పుడు వాకిలే లేదు.

అసలు వాకిలితో ఏం పని? కోటలో శివరావు ఆనందంగా వున్నాడు. అనుభవాల్ని నిత్యసత్యంగా మార్చే ప్రక్రియ అతనికి తెలిసిపోయింది. ఎంతో శ్రమకు ఫలితం అది! తన అనుభవాలన్నీ శాశ్వతాలైపోయాయి. తనకు పూర్ణత్వం సిద్ధించింది. ఇది కేవలం తన కోట! మనసులో పలురకాల భావాలు ముప్పిరి గొంటూవుంటే ఆనందంగా అటూ యిటూ పచార్లుచేశాడు కోటలో.

కొంత సేపటికి అతనికి ఊపిరాడనట్లు, ఉక్కిరిబిక్కిరౌతున్నట్లు, శరీరం బిగుసుకుపోతున్నట్లు అనిపించింది. ఇక్కడ గాలి చాలటంలేదు! ప్రాణవాయువులేదు. క్షణక్షణానికీ అతని శక్తి క్షీణించిపోతున్నది. వున్నట్లుండి ధమామని క్రిందపడిపోయాడు శివరావు.

గుట్టమీదవున్న మనిషి ఎప్పట్నుండో శివరావుని గమనిస్తున్నాడు. శివరావు చేష్టలు అతనికి విచిత్రంగా వున్నై. ఆలోచనలో పడ్డట్లు, చేతిలో ఏమో వున్నట్లు, ఏదో పని చేస్తున్నట్లు శివరావు చేస్తున్న చేష్టల్ని చోద్యంగా చూస్తున్నాడతను. శివరావు పడిపోవటం కనిపించింది. గుట్ట దిగి దగ్గరకెళ్లి చూశాడు శ్వాస నిలిచిపోయింది. 'పుట్టినే యిట్లా చచ్చాడేమిటీ?' అనుకుంటూ వెళ్లిపోయాడతను...